క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పహాడీషరీఫ్: వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ఒత్తిడిని తట్టుకునేందుకు జల్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులో భాగంగా ఆదివారం విద్యుత్ అంతరాయం కలగనుంది. పలు ప్రాంతాలలో ఉదయం నుంచి 10–15 నిమిషాల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పహాడీషరీఫ్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్, మామిడిల్లి రంగ నాయకుల కాలనీ, గౌస్ నగర్, నూరీనగర్, వాదే ముస్తఫా, ఇస్మాయిల్‌నగర్‌లలో ఈ అంతరాయం ఉంటుందన్నారు.

నేడు కొల్కులపల్లిలో బొడ్రాయి వార్షికోత్సవం

మాడ్గుల: మండలంలోని కొల్కులపల్లి గ్రామంలో ఆదివారం నాభిశిల(బొడ్రాయి) ద్వితీయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు బట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బొడ్రాయి వద్ద గణపతిపూజ, అభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు.

వెయిటింగ్ హాల్ ప్రారంభం



గదిని ప్రారంభిస్తున్న జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా కార్యాలయంలో వినియోగదారుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను శనివారం జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ ప్రారంభించారు. దాతల సహకారంతో వీటిని పూర్తి చేశామని ఆయన తెలిపారు. అలాగే వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణాశాఖ అధికారి సుభాష్‌చంద్రరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అన్నసంతర్పణ



అన్నం వడ్డిస్తున్న శ్రీనివాసురెడ్డి తదితరులు

తలకొండపల్లి: అన్నదానం గొప్పదని ప్రముఖ వ్యాపారవేత్త, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాసురెడ్డి అన్నారు. సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని దానం చేయాలన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వర దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం వాలీబాల్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 18వ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మెన్స్ అండ్ ఉమెన్స్ సీనియర్, జూనియర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాసు శ్రీనివాసురెడ్డి భక్తులు, క్రీడాకారులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పాఠశాలకు మొక్కల వితరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం మరువలేనిదని పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ పేర్కొన్నారు. ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలకు ఎస్‌బీఐ ఆదిబట్ల బ్రాంచ్ మేనేజర్ వసంత లలిత రాజమండ్రి, తూర్పుగోదావరి ప్రాంతంలోని కడియంలంక నుంచి 200 జామ, రావి, ఉసిరి, నేరేడు, సపోట, నిమ్మ, బాదంతో పాటు పూల మొక్కలు తెప్పించి అందజేశారు. శనివారం వాటిని నాటి నీరు పోసి సంరక్షించారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన పోతుగంటి ఆంజనేయులు ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు బాధితుడు ఆంజనేయులుకు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు ట్రస్టు సభ్యులతో రూ.పది వేలు అందిచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలితాజ్యోతయ్య, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్‌యాదవ్, నాయకులు మల్లేష్‌యాదవ్, మహేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

మండల పరిధిలోని చంద్రధనకు చెందిన చంద్రయ్య(62) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.మూడు వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు శేఖర్, చెన్నయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పక్కదారి!



మంఖాల్ పారిశ్రామికవాడలో వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్లలోకి నింపుతున్న జలం

వ్యవసాయ బోర్ల కేంద్రంగా అక్రమ దందా
- ట్యాంకర్ల ద్వారా యథేచ్ఛగా నీటి తరలింపు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

తుక్కుగూడ: రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పక్కదారి పడుతోంది. కొందరు అక్రమార్కులు తమ స్వార్థానికి దీన్ని వినియోగించుకుంటున్నారు. వ్యవసాయ బోరుబావుల ద్వారా యథేచ్ఛగా ఉచిత విద్యుత్‌ను వినియోగిస్తూ.. వాటి నుంచి ట్యాంకర్లతో తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రూ.లక్షల్లో కరెంట్ బిల్లులకు గండి కొడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్, ఇమామ్‌గూడ, తుక్కుగూడ, రావిర్యాల, సర్దార్‌నగర్‌లో శ్రీశైలం జాతీయ రహదారిపై రాత్రి పగలు అనే తేడా లేకుండా ఈ దందా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

భారీగా దండుకుంటున్నారు

తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రియల్ వ్యాపారులు చేసే వెంచర్లు, భవనాల నిర్మాణాలతో పాటు, ఈ–సిటీ, మంఖాల్ పారిశ్రామికవాడలో వందలాది పరిశ్రమలు ఉండటంతో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీనిని ఆసరాగా మార్చుకొని కొందరు తమ ట్యాంకర్ల ద్వారా రోజుకు వేల లీటర్ల నీటిని విక్రయిస్తున్నారు. భూగర్భజలాలు తగ్గి నీటి కొరత రావడంతో విచ్చలవిడిగా రేట్లు పెంచి నీటిని అమ్ముకుంటున్నారు. ఒక్కో ట్యాంకర్ రూ.2 వేల నుంచి రూ.3 వేలను వసూలు చేస్తున్నారు. బోర్లలు ఎండిపోవడంతో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ కొత్త బోర్లు వేస్తున్నారు. మున్సిపాలిటీలో రోజుకు లక్షల రూపాయల నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. నిత్యం నీటి సరఫరా చేయడంతో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటుతున్నాయి. రెండు, మూడు నెలల నుంచి భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిన జాబితలో మహేశ్వరం మండలం ఉంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్ తీసుకొని వ్యవసాయేతర పనులకు ఉపయోగిస్తుండటంతో డిస్కం ప్రతినెలా రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. విద్యుత్ చౌర్యంపై కేసులు నమోదు చేసే అధికారులు ఈ విషయం పట్టించుకోకపోవడం గమనార్హం. ఉచిత విద్యుత్ దోపిడీకి గురవుతున్న విద్యుత్ శాఖ అధికారులు ట్యాంకర్ల నిర్వాహకుల దగ్గర వేల రూపాయాలు ముడుపులు తీసుకుంటున్నట్లు విమర్శలు వ్యక్తం అయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలో ఓ విద్యుత్ లైన్‌మెన్ ఈ వ్యవహారాలు చూడటంలో కీలక పాత్ర వహిస్తున్నారు. స్థానికులు ఉచిత విద్యుత్ దుర్వినియోగంపై పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి నీటి వ్యాపారం చేస్తున్న బోర్లను పరిశీలించి తగ్గిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఉచిత విద్యుత్‌ను వ్యవసాయ పనులకు మాత్రమే వాడాలి. ఎట్టి పరిస్థితుల్లో ఇతర పనులకు వాడుకోవద్దు. అక్రమంగా నీటిని తరలిస్తూ, ఉచిత విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తే కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– చక్రపాణి, విద్యుత్ ఏఈ, మహేశ్వరం



నిర్వహణ లోపం.. కంప చెట్లే సాక్ష్యం!

శ్రీశైలం హైవే కొత్తూర్ గేట్ నుంచి వావిళ్లకుంటతండా వరకు ఫార్మాసిటీ కోసం ప్రతిష్టాత్మకంగా 200 అడుగుల విస్తీర్ణంలో గతంలో రహదారిని నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించారు. కాగా ఆ రహదారి పైకి చేరుకునేలా కిందికి దిగేలా ఉన్న పలు క్రాస్ రోడ్ల వద్ద రహదారి నిర్వహణ వదిలేశారు. దీంతో ముళ్ల కంప చెట్లు మొలచి ఇబ్బందికరంగా మారాయి. కందుకూరు నుంచి మాలగూడూరు వెళ్లే మార్గం వద్ద ఫార్మా రహదారికి పైకి చేరుకునే రోడ్డులో సైతం ఇరువైపులా ఇలా కంప చెట్లు మొలిచాయి. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– కందుకూరు

వరద కాలువ నిర్మాణానికి తగిన చర్యలు



అధికారులతో వరద కాలువ నిర్మాణ పనులపై చర్చిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టుకాలనీ, జగదాంబ కాలనీల మీదుగా నిర్మించే వరదనీటి కాలువ నిర్మాణానికి ఉన్న అడ్డంకులను అధిగమించి త్వరితగతిన పనులు చేపడతామని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం హైకోర్టుకాలనీలో వరద కాలువ నిర్మాణం విషయమై టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, కాలనీవాసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు వనస్థలిపురం తూర్పు కాలనీల నుంచి హైకోర్టుకాలనీ, జగదాంబ కాలనీల మీదుగా వెళ్లే వరదనీటి కాలువ అవుట్‌లెట్ నిర్మాణానికి నిధులు మంజూరు అయినా ప్రైవేటు వ్యక్తుల స్థలానికి సంబంధించి వివాదం ఉండడంతో పనులు ఆగిపోయాయని అన్నారు. అధికారులు, కాలనీ వాసులతో చర్చించి వరద కాలువ నిర్మాణానికి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పావనీ, డీఈ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఈస్టన్ కాలనీల అసోసియేషన్ అధ్యక్షుడు దీపావళి శ్రవణ్, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి సభ్యుల సహకారం

చైర్మన్ పాండు రంగారెడ్డి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైర్మన్ ఎదుళ్ల పాండు రంగారెడ్డి కోరారు. శేరిగూడలోని పీఏసీఎస్ కార్యాలయంలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ద్వారా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. అన్నదాతలకు ఎప్పుడూ తమ సహకారం ఉంటుందన్నారు. సంఘం అభున్నతికి సభ్యులంతా పాటుపడాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రైస్‌మిల్లును త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. లాభాల బాటలో పయనిస్తున్న సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. కాగా లాభాలు, ఖర్చులు, రుణాలు తదితర సంబంధిత అంశాలపై చర్చించారు. సమావేశంలో సీఈఓ గణేశ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా సొసైటీ

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగిన వెంకట్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సొసైటీ ద్వారా ఆర్థిక సహాయం చేశారు. శనివారం మృతుని భార్య పద్మకు రూ.15 వేల చెక్‌ను డైరెక్టర్లు అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ గణేశ్, మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, సుధాకర్‌రెడ్డి, పోచమ్మ, పుల్లయ్య, సీతయ్యలున్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి

ఏపీడీ సక్రియ నాయక్

మంచాల: గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలందరికీ పని కల్పించాలని ఏపీడీ సక్రియ నాయక్ సూచించారు. శనివారం మండలంలోని బోడకొండ, కొర్రవాణి తండా, రంగాపూర్, లోయపల్లి, ఆంబోత్ తండా గ్రామాల్లో పర్యటించారు. పని ప్రదేశాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తాగు నీటికి ప్రతి మనిషికి రూ.2.50 చొప్పున చెల్లించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తేనే దినసరి కూలీ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వీరాంజనేయులు, టీఏ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు శోభరాణి, మాధవి, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిసెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు విరాళం

కడ్తాల్: మహనీయులను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని చరికొండ గ్రామంలో యువక్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మహాత్మ జ్యోతి బాపూలే విగ్రహ ఏర్పాటుకు ఆయన రూ.10 వేల విరాళాన్ని శనివారం అందజేశారు. మహనీయుల బాటలో నడవాలన్నారు.

హుషారుగా ముగింపు



ఆమనగల్లు: పరీక్షా కేంద్రం వద్ద విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు

ఆమనగల్లు: ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాలలో పదో తరగతి పరీక్షలు శనివారం సజావుగా ముగిశాయి. ఆమనగల్లు మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు, కడ్తాలలో మూడు, తలకొండపల్లిలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో ఈ నెల 18న ప్రారంభమైన పరీక్షలు శనివారం ముగిశాయి. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. విద్యార్థులు ఒకరినొకరు కలిసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలువురు విద్యార్థులు సెల్ఫీలు దిగారు.

ముగిసిన పది పరీక్షలు

మాడ్గుల: మాడ్గుల మండలంలో పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. చివరి రోజున విద్యార్థులు ఉత్సాహంతో పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలగడంతో విద్యార్థులు రెట్టింపు ఉత్సాంహంతో కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు.

వైభవంగా రథోత్సవం

కొనసాగుతున్న దేవుని పడకల్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



భారీగా పాల్గొన్న భక్తులు

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించారు. యువకులు కేరింతలు కొడుతూ ఉత్సాహభరితంగా రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజుకుమార్‌రెడ్డి, కార్య నిర్వాహకులు రంజిత్‌రెడ్డి, మధుకుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, శంకర్, శంకర్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు కృష్ణగౌడ్, స్వామిగౌడ్, సిబ్బంది ఆంజనేయులు, జంగయ్య, మల్లేష్, జగ్గారెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు



స్వామి వారి ఉత్సవ విగ్రహాలు

యాచారం తిరుమలనాథ ఆలయానికి భక్తుల తాకిడి


యాచారం: గోవిందా.. గోవిందా.. అనే నామస్మరణతో శనివారం యాచారం గ్రామం మార్మోగింది. తిరుమలనాథ దేవాలయ ఆవరణలో జరిగిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం స్వామివారి మూల విరాట్‌కు పూజారులు రాజేశ్‌కుమార్, హరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సన్నాయి, భజన కీర్తనల నడుమ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అలువేలు మంగమ్మల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించడానికి జిల్లాలోని పలు మండలాలతో పాటు నల్గొండ, హైదరాబాద్, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి

స్వామి వారి కల్యాణోత్సవంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, మాజీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం ఎదురుచూపులు!

మన్సూరాబాద్- పోచంపల్లి పాత రోడ్డును పునరుద్ధరించాలంటున్న స్థానికులు



మన్సూరాబాద్-పోచంపల్లి పాత రోడ్డు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ నుంచి పోచంపల్లి పాత రోడ్డు పునరుద్ధరణకు ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచుస్తున్నారు. రాకపోకలు మందగించడంతో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ రోడ్డు కనుమరుగైంది. అటవీశాఖ రోడ్డుకు అడ్డంగా తమ ప్రహరీని నిర్మించటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రోడ్డు పునరుద్ధరణకు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుంటున్నప్పటికి ఆచరణలో అవాంతరాలు ఎదురవుతున్నాయి.

- 1986–87లో ఈ రోడ్డును నిర్మించారు. ఎల్‌బీనగర్‌లోని సిరీస్ కంపెనీ నుంచి మన్సూరాబాద్, కుంట్లూర్, కుత్బుల్లాపూర్, గౌరెల్లి, పసుమాముల, తారమతిపేట, బండరావిరాల, పెద్దగూడెం, జూలూరు మీదుగా పోచంపల్లికి గతంలో నిత్యం సర్వీసు బస్సులు నడిచేవి. ఆటోనగర్‌లో డంపింగ్‌యార్డ్ కారణంగా చెత్తను ఈ ప్రాంతంలో వేస్తుండటంతో చెత్తతో రోడ్డు నిండిపోయి రాకపోకలు మందగించాయి. ఆ తరువాత అటవీశాఖ మహావీర్ హరిణి వనస్థలి జాతీయ పార్కును ఏర్పాటు చేసి ప్రహరీల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం జాతీయ రహదారిపై పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ఈ రోడ్డును పునరుద్ధరిస్తే రాకపోకలకు సులువుగా ఉండటమే కాకుండ సుమారు 5 కిలోమీటర్ల మేర దూరం కూడ తగ్గుతుండటంతో రోడ్డును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధుల చొరవతో

- మన్సూరాబాద్ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చొరవతో ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు పరిశీలించి మన్సూరాబాద్ నుంచి అటవీశాఖ ప్రహరీ నిర్మించిన రోడ్డు వరకు రూ.1.90కోట్లతో రోడ్డు విస్తరణ చేపట్టి నూతన రోడ్డును నిర్మించారు. ప్రహరీని తొలగించి మహావీర్ హరిణి వనస్థలి జాతీయ పార్కులో నుంచి కిలోమీటర్ రోడ్డును నిర్మిస్తే పూర్తి స్థాయిలో రాకపోకలు కొనసాగేందుకు వీలుంది.



ఆటోనగర్ చెత్త డంపింగ్‌యార్డ్ వద్ద చెత్తతో మూసుకుపోయిన రోడ్డు



రోడ్డుకు అడ్డంగా ప్రహరీని నిర్మించిన అటవీశాఖ

కేంద్రప్రభుత్వ పరిశీలనలో ఉంది



మన్సూరాబాద్ టూ పోచంపల్లి పాత రోడ్డు పునరుద్ధరణ విషయం కేంద్ర అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కేంద్ర అటవీశాఖ మంత్రికి సమస్యపై వివరించాను. ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పునరుద్ధరణ జరుగుతుంది.

– కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్